# ప్రేమయున్నచోట దైవమున్నాడు

జయంతి బ్రహ్మానందం గారు

(టాల్‌స్టాయి కథనుండి)

ఒకపట్టణమున మాకన్న యను మాదిగవాడుండెను. వాడు చక్కగా చెప్పులజోళ్లు కుట్టువాడు. వాడుండినయిల్లు లోతైన మారుగల్లి చిన్నగదియొకటి గలది. ఆగదినున్న యొక్కకిటికీ వీధివైపున నుండెను. అది మిక్కిలి క్రిందిగనుండుటచే దానిద్వారా వీధిలో నడచువారి పాదములే కాన్పడును. మరేమియు గానబడదు. కాని మాకన్న జనులపాదరక్షలు (జోళ్లు) బట్టియే వారిని పోల్చుకొనగలిగెడువాడు. వాడాపురమున చిరకాలముండుటచే ననేకులతో పరిచయముగలదు. ఆచుట్టుపట్ల నున్నవారి జోళ్లన్నియు, వానివద్దకు నొకటో రెండో సారులు మరమ్మతునకు వచ్చియుండినవే; అందుచేత వాడు తనపనితనమును దినమును కిటికీనుండి చూచుచుండువాడు. కొన్నిటికి వాడు అడుగుతోళ్లను, మడమలను వేసెను; కొన్నింటికి కతుకులు వేసెను; కొన్నింటికి కుట్లు కుట్టెను; కొన్నిటికి పైభాగమంతయును కూడ క్రొత్తగా తానే వేసెను. వానికి చేతులనిండ పనియుండెడిది. కష్టపడి పనిచేయువాడు, మంచిసామగ్రి నుపయోగించువాడు, ఎక్కువకూలి పుచ్చుకొనువాడు కాడు, నమ్మదగియుండినవాడు. కావలసిననాటికి పనిపూర్తిజేసి యివ్వగలనని తోచినప్పుడే పనికంగీకరించి పుచ్చుకొనువాడు. లేనిచో వాడు నిజము చెప్పెడివాడే కాని శుష్కవాగ్దానములు చేసెడివాడు కాడు. ఇందుచేత వాడు పేరుపడిన పనివాడై, కావలసినంత పనిగల్గియుండెను.

మాకన్న మొదటినుండియు మంచివాడే. కాని వృద్ధాప్యమున నింకను తన యాత్మనుగూర్చి యెక్కువగా తలంచుచు, పరమేశ్వరున కింకను సమీపస్థుడు కాగోరుచుండెను. తాను కూలికి యజమానునౌకరీలో నుండినపుడే వానిభార్య మూడేండ్ల చిన్నికుమారుని, భర్తపై విడిచి స్వర్గస్థురాలయ్యెను. అంతకంటె ముందుపుట్టిన బిడ్డలందరును వారి చిన్నతనములలోనే మరణించిరి. మొదట వాడు తనచిన్నకుమారుని, గ్రామములోనున్న తనయక్కగారింటికి పంపివేయ తలచియుండెను. గాని, చిన్నబాలుని విడిచియుండలేక "మాచిన్నినాయనకు క్రొత్తవారింట్లో పెరుగుట కష్టముగానుండును, నాతోనేయుంచుకొనెద"నని యనుకొనెను.

మాకన్న తనయజమాని కొలువువిడిచి చిన్నిబాలునితో నద్దెయింటికి పోయియుండెను. కాని వానికి తనబిడ్డలు సుఖముగానుండ జూచుకొను యోగము లేదు. కొడుకు పెరిగి కొంత పెద్దవాడై, చేతికంది తండ్రికి పనిపాటులలో తోడ్పడి యానంద మొనగూర్చు యీడువచ్చిన సమయమున నాచిన్నవానికి జబ్బుచేసి వారముదినములు తీక్ష్ణమైన జ్వరముతో బాధపడి మరణించెను. ఈదెబ్బతో మాకన్న ధైర్యముచెడి, యాశలన్నియు నడుగంటిన వాడయ్యెను. నిరాశచేతను వాడు దైవనింద కూడ చేయదొడంగెను. దుఃఖాతిశయముచే వాడు మాటిమాటికి, ముసలియయ్యు తాను బ్రతికియుండిపోతిననియు, తాను మిక్కిలి ప్రేమించిన పుత్రుడు, ఏకమాత్రపుత్రుడు మరణించెననియు, తానుకూడ మరణమునే యనుక్షణమును గోరుచు నీశ్వరధ్యానము చేయుచుండెను. అంతటినుండి వాడు గుడికిపోవుట కూడ మానివైచెను.

ఒకనాడు మాకన్న స్వగ్రామనివాసియైన యొకవృద్ధుడు, అప్పటి కెనిమిదేండ్లనుండి తీర్థయాత్రలు చేయుచుండిన వాడు. గుడినుండి తిరిగివచ్చు మార్గమున మాకన్న యింటికి వచ్చెను. మాకన్న వానితో మనసిచ్చి మాట్లాడి తన దుఃఖమును వెళ్లబోసికొనెను. "నాకు మరి జీవింప కోరికయే లేదు. నేనుకూడ వేగమే చావవలెననియే నేనీశ్వరుని కోరునదియెల్లను. నాకు ప్రపంచమున నింక యేయాశయును లేదు" అనెను. "మాకన్నా,

యట్లనుటకు నీకు హక్కేమియు లేదోయి. ఆదేవుని కార్యములు మన మాక్షేపింపదగినవారమా? అతనియిచ్ఛయే కాని, మన న్యాయవిచారణ, యాలోచనలును పనికిరావు. నీబాలుడు మరణించి నీవు జీవింపవలె ననియే యాతనియిచ్ఛ కావున నదియే యుత్తమమైనదేమో! నీ నిరాశ విషయమైయా?—నీవు నీస్వసుఖముగూర్చియే జీవింపగోరుదువు కాన నీకిది కల్గుచున్నది." "ఐన మరెందు కొరకొకరు జీవింపవలెను?" అని మాకన్న యడిగెను. "దేవునికొఱకేనోయి, యతడే నీకు ప్రాణము నిచ్చెను, నీవాతనికొఱకే జీవింపవలెను. నీ వతనిగూర్చియే జీవింపనేర్చికొనినపుడు నీకు మరి విచారమేయుండదు. అంతయు సుఖముగనే, సుఖముగనే తోచుచుండును" యని యా ముసలివాడనెను. కొంతసేపు మాకన్న మాటాడక, తరువాత నిట్లడిగెను "కాని యెవడైనను దేవునికొఱకు జీవించు టెట్లు?" ముసలివాడు జవాబు చెప్పెను:—"దేవునికొఱకు జీవించు టెట్లో, క్రీస్తు మనకు చూపించియే యున్నాడు. నీకు చదువు వచ్చునా? వచ్చినచో మతగ్రంథములను కొని చదువుము. వానిలో నీవెట్లు జీవింపవలెనని దేవుడు కోరునో తెలుపబడి యున్నది. అంతయు వానిలోనే యున్నది." ఈపలుకులు మాకన్న హృదయమున నాటిపోయినవి. ఆనాడే వాడుపోయి పెద్దయచ్చుగల యొక మతగ్రంథము గొని తెచ్చుకొని చదువ నారంభించెను. మొట్టమొదట వాడు సెలవుదినములలో మాత్రమే చదువ నుద్దేశించెను. కాని, యొకసారి చదువ మొదలిడిన తరువాత నది తన హృదయభారము నతితేలిక జేసివైచుట జూచి యనుదినమును చదువ నారంభించెను. ఒక్కొకసారి యాచదువులో వాడు మేనుమరచి లీనమై పోయెడివాడు. ఇంతలో దీపమున చమురయిపోయి దీప మారిపోయెడిది. ప్రతిరాత్రియు వాడు చదువజొచ్చెను. ఎంతచదివిన నంత చక్కగా వానికి తననుండి దేవుడేమికోరి యున్నాడో, తానెట్లతనికొఱకు (అతని సేవకొఱకు) జీవింపవలెనో బోధపడుచుండెడిది. వాని హృదయభారము తగ్గుచుండెను. ఇంతకుముందు రాత్రి వేళవాడు పడుకొనబోవునపుడు తన ముద్దుతనయుని వియోగశోకమున మునింగి విలపించు చుండెడివాడు. కాని, యిపుడో మాటిమాటికి నిట్లు దైవమును ప్రార్థించుచుండువాడు. జయము, జయముతండ్రీ, పరమపితా, నీయిచ్ఛయే పరిపూర్ణముగా నెరవేరుగాక!

అప్పటినుండి మాకన్న జీవితమంతటియందును మార్పువచ్చెను. ముందు, సెలవుదినములలో వాడు పురమందిరమునకుపోయి టీ పుచ్చుకొనుచుండెడి వాడు. ఒకటి రెండుగ్లాసుల మద్యముకూడ పుచ్చుకొన వెరచు వాడుకాడు. ఒక్కొకసారి యేదోస్నేహితునితో కొంచెముపుచ్చుకొని బాగుగా మత్తెక్కకపోయినను కొంచెము మైమరచి తెలివితక్కువ మాటలనాడుచు దారిపోవువారినిజూచి కేకలువేయుటయో, తిట్టుటయో చేయుచుండెడువాడు. ఇప్పు డట్టిదంతయు విడిచిపెట్టెను. వానిజీవనము శాంతిమయమున, ఆనందమయమున య్యెను. ఉదయముననే వాడు తనపనివద్ద కూర్చుండును; దినమంతయు పనిచేసి రాత్రి గోడనున్నదీపమును క్రిందికి దింపి బల్లపైబెట్టి గూటిలోనున్న పుస్తకమును తెచ్చి తెరచి చదువ నారంభించును. చదివినకొలది వానికి చక్కగా బోధపడుచుండెను. మనస్సున పరిశుభ్రమయిన హాయిని పొందుచుండెను.

ఒకనాడు వాడు రాత్రికాలమువరకు చదువుచుండెను. వాడానాడు చదువుచున్నభాగ మతి సుబోధకముగ నుండెను. ఆ గ్రంథములోని యారవ యధ్యాయములో నీక్రింది తాత్పర్యముగల పద్యములను వాడు చదివెను:—'నిన్నొక చెంపపై కొట్టినవానికి నీ రెండవ చెంపనుకూడ నిమ్ము. నీకోటును దొంగలాడికొని పోవుచున్నవానికి, నీ చొక్కానుకూడ నిచ్చుటకు వెనుదీయకుము. నిన్నడుగు ప్రతివానికిని లేదనక నిచ్చుచుండుము. నీ వస్తువులను తీసికొనిపోయిన వానినుండి వాటిని తిరిగి యడుగకుము. మరియు నీ కితరు లెట్లు చేయవలెనని కోరుదువో నీవును వారిపట్ల నట్లే వర్తింపుము.' మరియు భగవంతుని వాక్యములుగా నింకను యీరీతిగా చదివెను:- 'నన్ను మీరేల ప్రభువా! తండ్రీ! యని పిలుచుచును, నేను చెప్పినట్లెల్ల జేయరు? నావద్ద కెవడువచ్చి నా వాక్యముల విని తదనుగుణ్యముగ ప్రవర్తించునో, వాడు లోతుగా

పునాదులను త్రవ్వి, రాతిపునాదునువేసి యిల్లు కట్టినటువంటివాడు. వానయో, వరదయో వచ్చినపు డాయిల్లెంత తడసి నానినను రాతిపునాదుల యిల్లగుటచే చెక్కుచెదరదు. కాని వాక్యముల వినియు నట్లాచరింపనివాడు పునాదిలేనిదే నేలమట్టముపై నిల్లుకట్టినవానివంటివాడు. వరద రాగానే దానిదెబ్బకు నాయిల్లు వెంటనే కూలిపోయి చాల నష్టము కలుగును." మాకన్న యీవాక్యములు చదవగనే వాని యాత్మకు చాల యానందము కలిగెను. వాడు తన సులోచనములను తీసివేసి మణుకులను బల్లపై నాని తాను చదివినదానిగూర్చి యట్టె యాలోచించుచుండెను. ఆవాక్యముల ననుసరించి తనజీవితము నతడు సరిజూచుకొనుచు నిట్లనుకొనెను "నాగృహము రాతి పునాదిపై గట్టబడినదా, యిసుకపైనా? రాతి పునాదియైన సరియే. ఇచ్చట నొంటరిగాఁ (ఏకాకిగా) కూర్చొని యీశ్వరాజ్ఞానుసార మంతయు చేసితినని తలపోయునపుడు సుఖముగనే యున్నది. కాని నేను నా సావధానత (జాగ్రత)ను తప్పినతోడనే మరల పాప మాచరింతును. ఐనను నింకను నేను పట్టువీడక ప్రయత్నించెదను. అది యత్యానందమును చేగూర్చును. ప్రభూ! నన్ను రక్షించి నాకు తోడ్పడుము."

ఇట్లంతయు దలచి పండుకొనబోయి తిరిగి పుస్తకము విడువ మనసు రాకుండుటవలన నింకను చదువుచుండెను. ఆభాగములో నొక ధనికుడు ప్రభుని (దైవమును) తనయింటి కాహ్వానించినట్లును, తా నాతనిని పాదములు కడిగి తుడిచి గౌరవింపకుండగా, నతనిభార్య, పాపకార్యముల జేసియుండిన యామె యతనిపాదములను తన కన్నీటితో కడగి, తన కుంతలములతో తుడిచి, యాతని పాదములను శిరస్సున దాల్చినట్లును, అంతట ప్రభుడు సంతసించి యా యింటియజమానితో, 'నేను నీయింటికి రాగా నీవు నాకు పాదములు కడుగ జలమొసంగలేదు. నాపాదములను తుడువలేదు. నాపాదపద్మముల శిరసున దాల్పలేదు. కాని నీభార్య పాపి యనిపించుకొనుచున్నది, నా కతి భక్తివినయములతో సేవజేసినది చూచితివా?' యనియెనట! ఈకథ నతడు చదివి మరిమరి తలపోయుచుండెను. "ఆ ధనికు డెవడో నావలెనే యున్నాడే! అతడుకూడ తన స్వసుఖమును గూర్చియే చూచుకొనెను—నా భోజనవిషయ మేమి?, నా యిల్లుసంగతి యేమి? నా భార్యాబిడ్డల సంగతి యేమి?—అంతేకాని యింటికివచ్చిన యతనినిగూర్చి యొక్కసారియైన యోచింపలేదు. తన జాగ్రతనే తాను పడెనుగాని, చుట్టముగూర్చి లక్ష్యపెట్టనేలేదు. ఐనను వచ్చినయతిథి యెవరు? ప్రభువే. సాక్షాత్తు భగవానుడే. అతడు నాయింటికివచ్చిన, నే నట్లే చేసియుందునా?"—అనుకొనుచు మాకన్న తనరెండుచేతులపై తల నుంచుకొని నిద్రజెందెను. ఎప్పుడు నిదురపట్టెనో వానికే తెలియదు.

'మాకన్నా!' యని యెవరో తన చెవిదగ్గ పిలిచినట్లు వానికి తటాలున వినబడెను. వాడు నిద్రనుండి త్రుళ్లిపడి లేచి 'ఎవరది?' యని యడిగెను. వెనుదిరిగి తలుపువైపు జూచెను. ఎవ్వరును లేరు. వా డింకొక సారి పిలిచెను. ఈసారి వాడు స్పష్టముగా నీమాటలను వినెను. 'మాకన్నా, మాకన్నా, రేపు వీధివైపు చూచుచుండుము, నేను వచ్చెదను.'—మాకన్న తెలివితెచ్చుకొనెను. కుర్చీనుండి లేచి కళ్లు నులుముకొనెను కాని యీ మాటలను తాను కలలో వినెనో, తెలిసియుండియే వినెనో వానికి తెలియలేదు. వాడు దీపమార్పివేసి, పండుకొనబోయెను.

మరునాడు సూర్యోదయమునకు పూర్వమే వాడు లేచి, దైవప్రార్థనజేసికొని, నిప్పుచేసి గంజి కాచుకొని, యంబలి చేసికొనినాడు, పొయ్యిమీద నీళ్లుపెట్టి మామూలుప్రకారము తన పనికి కిటికీప్రక్కను కూర్చొనెను. కూర్చొని పనిచేయుచు వా డాముందురాత్రి జరిగినదంతయుగూర్చి యాలోచించుకొనెను. ఒకప్పుడు వాని కది కలవలె తోచుచుండెను. ఒకప్పుడు నిజముగ వా డాకంఠస్వరమును విన్నాడనని నిశ్చయించుకొనుచుండెను. 'పూర్వ మిట్టివి జరుగుట కలదు' అని వా డనుకొనెను. ఆనాడు వాడు పనిచేయుటకంటె వీధిలోనికి చూచుటయందే యెక్కుడు శ్రద్ధావంతుడై యుండెను. క్రొత్తజోళ్లు వేసికొని యెవరైన నటునడచిన, వంగి వారి ముఖమునుగూడ చూచుట కాతురపడుచుండెను. క్రొత్త

జోళ్లు వేసికొని యొక నౌఖరును, తరువాత నొక నీళ్ల కావడివాడును నావీధిని నడచిరి. ఇంతలో పూర్వము సిపాయిగానుండిన యొక ముసలివాడు, చేత పారఫుచ్చుకొని వాని కిటికీవద్దకు వచ్చెను. వాని యశుభ్రమైన కుళ్లుపాతజోళ్లు, వానిపై నతుకులు చూడగనే మాకన్న వానిని గుర్తించెను. ఆముసలివాని పేరు సీతన్న. చేరువనున్న యొక వర్తకుడు వానిని తనయింట నూరకనే తిండిపెట్టి యుంచెను. వానిపని యింటి నౌఖరుకు తోడ్పడుటమాత్రమే. వాడు మాకన్న యింటి కిటికీ యవతలి చెత్తను తీసివేయ నారంభించెను. మాకన్న వానిపై నొకసారి చూచి తనపని చేసికొనుచుండెను. 'నేను ముసలివాడ నగుచున్నకొలది నాకు చేదస్తము హెచ్చుచున్నట్లున్నది. సీతన్న చెత్తతుడుచుటకు వచ్చుచుండును' వానిని చూచి నేను ప్రభువు, భగవంతుడే వీనిరూపమున వచ్చెనా? యనుకొనుచున్నాను. నాకు పిచ్చిపట్టుచున్నది, యనుకొని తన దురూహకు తానే నవ్వుకొనెను. ఐనను తాను కుట్టుచుండిన జోడు మరి కొంచెము కుట్టినంతనే వానికి తిరిగి కిటికీనుండి పైకి చూడవలెనని బుద్ధిపుట్టెను. సీతన్న తనపారను గోడకు జేరబెట్టి తానును కొంత విశ్రాంతిగొనుచు చలిపట్టిన తన శరీరమును వెచ్చగా జేసికొన యత్నించుట మాకన్న చూచెను. వాడు బలహీనుడు, ముసలివాడు చెత్తనూడ్చి యెత్తివేయుటకును శక్తిలేనివాడు.

'వానిని లోనికి పిలిచి కొంచెము టీ యిద్దునా? పొయ్యిమీది నీళ్లు మరుగుచునే యున్నవి' యనుకొనెను. మాకన్న చేతిలోనున్న కంతాణి క్రిందబెట్టి వాడు లేచెను. కొంత టీ మరిగించెను. తనవ్రేళ్లతో కిటికీతలుపుపై తట్టెను. సీతన్న కిటికీవైపునకు వచ్చెను. మాకన్న వానిని లోనికిరమ్మని సంజ్ఞచేసి, తలుపుతీయుటకు తాను వెళ్లెను. 'లోనికిరమ్ము. కొంతవెచ్చ బడవచ్చును. నీకచట చలిగానుండి యుండును' యని మాకన్న వానితో ననెను.

'దేవుడు నీకు మేలుచేయుగాక! నిజమే నావళ్లంతయు నొప్పిగా నున్నది' యని సీతన్నలోనికివచ్చి, యొడలిపై మంచు దులుపుకొని, యింట తడికాళ్లగురుతులుపడునేమో యని కాళ్లు తుడుచుకొనబోయి, నీరసమునే వడకుచు నేలబడెను.

'కాళ్లు తుడుచుకొనక్కరలేదులే. నేల తడైతే నేనే తుడుస్తాను. అది నాపని. నీవుకూర్చొని కొంచెము టీత్రాగు' అని మాకన్న యనెను. రెండుపాత్రలలో టీ పోసి యొకటి సీతన్నకిచ్చి రెండవది తాను పళ్ళెములో చల్లారబోసుకొనెను. సీతన్న తన కిచ్చినది త్రాగివేసి పాత్ర బోర్లించి మిగిలిపోయిన పంచదారను దానిపైబెట్టి మాకన్న నభినందించుచుండెను. కాని యతని కింకను కావలసియుండె నన్నసంగతి యతనిజూచినచో తెలియుచునే యుండెను. 'మరికొంచెము పుచ్చుకొమ్మ'ని మరి రెండు గ్లాసులటీపోసి మాకన్నమాటిమాటికి కిటికీవైపు జూచుచుండెను. ఎవరినైన నెదురుచూచుచున్నావా యేమి?' యని యతనిచుట్టడిగెను.

'ఔనుగాని యెవరికొరకు నేనెదురుజూచుచున్నానో చెప్పుటకైన, నేను సిగ్గుపడుచున్నాను. అసలెవరైన వత్తురో లేదో కూడా నేను చెప్పజాలనుగాని నామనస్సులో నొకమాట పడినది. అది యొక కలయో లేక నిజముగానే విన్నానో చెప్పజాలను. అసలుసంగతేమో తెలియునా? నిన్నరాత్రి నేను యేసుక్రీస్తుగూర్చి చదువుచుంటిని. ఆమహానుభావుడు, తండ్రి, యెట్లుప్రజలతో కలసి జీవించెనో, యెట్లు బాధ లనుభవించెనో! నీ వతనిగూర్చి వినియేయుందువని తలతును?'

'ఔను, నేను వింటిని. కాని నేనజ్ఞానిని. నాకు చదువురాదు.'

'నేను చదువుచుంటిని. అతనిని గూర్చియు, నతడు భూమిపై నెట్లు జీవించినదియును, అతడొక నాడొక ధనికునింటికి పిల్వబడుటయు, నాధనికు డతని గౌరవింపకుండుటయు చదివితిని. చదువునపుడు నేననుకొంటిని 'ఆధనికుడు మహాత్ముడగు క్రీస్తును గౌరవింపకుండ నెట్లుండెను? ఆలోచించిన నాకుకూడ నటువంటిది సంభవింపవచ్చును. అతనిని తగురీతిని గౌరవించుటెట్లో నాకు తెలియదు. కాని ధనికు డతని కొరకేమియు జేయలేదు' అని నేనాలోచించుచుండగనే నిద్రవచ్చినది ఆనిద్రలో నన్నెవరో పేరుపెట్టి పిలిచినట్లయినది నేను త్రుళ్లిపడి లేచితిని. 'రేపు నేను వత్తును. నాకొరకు వేచియుండుము!' అని

యెవరో నా చెవిలో చెప్పినట్లు వినబడినది. ఒక్కసారి కాదు. రెండు సార్లు వినబడినది. నీవు నమ్ముదువో లేదో కాని యీమాటలు నామనసులో నెట్లుపడినవంటే యీ భ్రమకు నన్ను నేనే యెుకప్పుడు నిందించుకొనుచున్నను, అతనికొఱకై నిరీక్షింపక నుండజాలకున్నాను" అన్నాడు మాకన్న. సీతన్న తలవంచి యూరకున్నాడు. ఏమీ మాట్లాడలేదు. తన రెండవ గ్లాసు త్రాగుట పూర్తిజేసి యొక ప్రక్కను పడవేసెను. కాని మాకన్న దానిని తీసి తిరిగీ నింపెను. 'మనస్తృప్తిగా త్రాగుము. చూడు, ఆమహాత్ముఁడు క్రీస్తు మనజనులలో జీవించినప్పుడతడెవరిని నలక్ష్యము చేయలేదు. అతడెక్కువగా నిరాడంబరులకే బోధచేయువాడు. బీదలతోనే యెక్కువ సంచరించువాడు. అతడు తన శిష్యులుగా మనసోదరులనే, మనవంటి కార్మికులనే, పాపులనే యెన్నుకొనువాడు. అతడు చెప్పినదేమంటే 'ఎవడు తాను గొప్పవాడనుకొనునో వాడు నీచుడగును, తక్కువగా చూడబడును. ఎవడు తాను తక్కువవాడననుకొనునో వాడు గొప్పవాడుగా భావింపబడును, వానికౌన్నత్య మొసంగబడును. మీరు నన్ను ప్రభువా యందురు. నేను మీ పాదముల కడుగుదును. ఎవడు మొదటివాడగునో వాడందరికిని సేవకుడు కావలెను. ఏలననగా బీదలు, వినయవంతులు, సాధువులు, దయాళువులే పావనులు ధన్యులు."

సీతన్న టీ త్రాగుట మరచిపోయెను వాడు వృద్ధుడు సులువుగా మనసు మెత్తపడిపోవును. ఆమాటలను వినుచుండగనే యతనికండ్లవెంబడి నీరు కారుచుండెను. 'ఏమి! మరికొంత టీపుచ్చుకొనుము' అనెను మాకన్న కాని సీతన్న గ్లాసు నవతలకు త్రోసివేసెను. తన వందనము లర్పించెను, లేచిపోయెను.

'మాకన్నా, నాకృతజ్ఞతా వందనములు. నీవు నాకాహారము నిచ్చితివి. సుఖింపజేసితివి. నాకు దైహిక మానసికాహారములు రెండును దొరికెను. నాకు శరీర సౌఖ్యము నిచ్చితివి. యాత్మౌన్నత్యము కలుగజేసితివి." అని సీతన్న తెలిపెను.

'చాలమంచిది. మళ్లీ రమ్ము. నాకెవరయినచుట్టాలుండిన చాలా సంతోషము కలుగును,' అని మాకన్న యనెను. సీతన్న వెళ్లిపోయిన పైని మాకన్న మిగిలిన టీని పోసికొని త్రాగి, గ్లాసులు పళ్లెము నవతలబెట్టి తిరిగి కిటికీముందు పనిచేయ కూర్చుండెను. కుట్టుచున్నంతసేపును తిరిగి తిరిగి కిటికీవైపే చూచుచుండెను. క్రీస్తువచ్చునని వేచియుండెను — అతనిని, అతని చర్యలనుగూర్చియే ఆలోచించుచుండెను. అప్పుడు వాని హృదయమున క్రీస్తువచనములే, నీతులే నిండియుండెను.

ఆరోడ్డున నిరువురు సైనికులు నడచిరి. ఒకడు సర్కారువారిచ్చిన జోళ్లను, రెండవవాడు తన స్వంత పాదరక్షలును వేసికొనిపోయిరి. తరువాత పొరుగింటి యజమాని మంచి క్రొత్తదుస్తులతో వెళ్ళెను. ఆపైని రొట్టెలవాడు గంపనెత్తుకొని వచ్చెను. వారందరు వెళ్లిపోయిరి. తరువాత నొకస్త్రీ యున్ని మేజోళ్లను, పల్లెటూరుజోళ్లను వేసికొనివచ్చెను ఆమెకూడ నీయిల్లు దాటిపోవుచు కిటికీవద్ద నాగెను. మాకన్న తలనెత్తి కిటికీనుండి చూచెను. ఆమె క్రొత్తమనిషి. చింకిదుస్తులతో, చంటిబిడ్డ నెత్తుకొనియుండెను. ఆమె బిడ్డకు చలిగాలి తగులకుండ నుండుటకై గాలి కడ్డముతిరిగి గోడకు చేరువగా నిలబడెను. బిడ్డను కప్పుట కామెవద్ద నొకగుడ్డయైన లేదు. ఆమెగుడ్డలు వేసవి కాలమునకే తగినవి. ప్రాతవి, చింకివి. ఆబిడ్డ చలిచేత యేడ్చుచుండెను. తల్లి యూరుకోబెట్ట ప్రయత్నించుచుండెను గాని బిడ్డ యూరుకొనదు. మాకన్నకు కిటికీనుండి యేడ్పు వినబడుచుండెను. వాడు లేచి, వీధితలుపు తెరచి, మెట్లుదిగి "ఏమండోయ్, ఏమండోయ్" అని పిలిచెను. ఆమె విని తిరిగిచూచినది. "ఆచలిలో, మంచులో బిడ్డనెత్తుకొని యెందుచే నిలబడియున్నావు? రమ్ము లోనికి రమ్ము. వెచ్చగా నుండుము. బిడ్డ యేడ్పు మానును." అని మాకన్న యామెతో ననెను. ఆమె యామాటల కాశ్చర్యముందెను. కాని యాకళ్లజోడు పెట్టుకొన్న ముసలివృద్ధుడు తన్ను యింటిలోనికి రమ్మని పిలుచుటజూచి వాని ననుసరించెను. వారు మెట్లెక్కి యాచిన్నగదిలో ప్రవేశించిరి. మాకన్న యామెను తన పరుపువద్దకు తీసికొనిపోయెను. 'అదుగో, అక్కడ కుంపటిచేరువగా కూర్చొనుము. చలికాచుకొని బిడ్డకు పాలిమ్ము' అని యామెతో వాడనెను. 'నావద్ద

పాలు లేవు. నే నుదయమునుండి యేమియు తినలేదు' అని యామె చెప్పెను. ఐనను బిడ్డను రొమ్మునకు చేర్చుకొనెను. మాకన్న తలవంచుకొని, బల్ల యొద్దకు పోయి యొక కంచమును రొట్టెను తెచ్చి, గూటిలోనున్న పులుసును కొంత కంచములో బోసెను. పొయ్యిమీదనున్న గంజి చూడగా నింకను కాగియుండలేదు. అందుచేత నాపులుసే బల్లపై నుంచెను. రొట్టెను కొన్ని ముక్కలుగా కోసి మేకుననున్న గుడ్డనొకటితీసి బల్లపై పరచెను. "ఇక్కడ కూర్చొని తినుము. నేను బిడ్డనుగూర్చి చూచెదను. నాకు బిడ్డలుండిరి. వారిని యాడించి యోదార్చుట నాకు తెలియును."

ఆమె బల్లవద్ద కూర్చొని తిన నారంభించెను. మాకన్న బిడ్డ నొద్ద పరుపుప్రక్కన కూర్చుండెను. వాడు బిడ్డను తన పెదవులతో ముద్దిడుకొన యత్నించెను కాని పండ్లులేని వాడగుటచే బాగుగా ముద్దిడలేకపోయెను. బిడ్డ యేడ్పు మానలేదు. అంత, మాకన్న బిడ్డను వ్రేళ్లతో కితకితలు పెట్టి నవ్వింప యత్నించెను. బిడ్డకు వ్రేలుచూపి నోటపాడుచునట్లు నటించి, తిరిగి యా వ్రేళ్లు బిడ్డనోట బెట్టుకొన బోయినపుడు తీసివేయుచుండెను. అవి క్రొవ్వుతో నల్లగా నిండియుండెను. ఆనల్లని వ్రేలివైపు చూచిచూచి యాబిడ్డ యేడ్పు మానివేసెను. మాకన్నకు సంతోష మయ్యెను.

ఆమె తినుచుండెను; తానెవరో, ఎచటికి పోవుచున్నదో, మాకన్నతో చెప్పనారంభించెను. "నేనొక సిపాయిభార్యను, ఎనిమిదినెలల క్రిందట నాభర్తను సర్కారువా రెక్కడికో దూరదేశమునకు పంపివేసిరి. నాటినుండి వారిగూర్చి నాకేమియు తెలియరాలేదు. నేనొక వంటలక్కగా నుంటినిగాని యీబిడ్డపుట్టినపిదప, చంటిబిడ్డతో పనిచేయలేవని వారు నన్ను పనినుండి తొలగించిరి. అందుచేత పనిలేక, తిండికొరకు మూడునెలలనుండి దేవులాడుచుంటిని. నావద్దనున్న సర్వస్వమును తిండికొరకు నమ్మివేసితిని. నేనొక దాది (Nurse) గా నుండదలచితిని గాని నన్నెవరు నుంచుకొనలేదు. నేను చాల పలుచగాను, బలహీనముగాను నుంటినట. అందుచేత పనికిరానని రి. ఇప్పుడే యొకవర్తకునియింటికి వెళ్లియుంటిని. ఆయింట మాయూరివనిషి యొకర్తె పనిలోనున్నది. ఆయింటి యజమానురాలు, వర్తకునిభార్య, నన్ను పనిలోనికి తీసికొందునని వాగ్దానము చేసెను. ఇప్పటినుండియే నన్ను పనిచేయుట కుంచుకొనెదరను కొంటిని, కాని వారముదినముల తర్వాత రమ్మని యామె నన్ను పంపివేసెను. వారియిల్లు చాలదూరము, పాపము బిడ్డ నాయాసపెట్టితిని, నే నలసిపోతిని. మేము బసచేసిన యింటియామె మమ్ము కనికరించి, యూరకనే, ధర్మమున కచ్చట నుండనిచ్చుచున్నది. ఆమెకు నేను కృతజ్ఞురాలను. లేనియెడల నెచటనుందునో, యెట్లు జీవింతునో నే నెఱుగను."

మాకన్న దీర్ఘనిశ్వాసము విడిచెను. 'అయితే, మీకు వెచ్చనిగుడ్డయైన లేదా?' అని యడిగెను. "అయ్యో నాయనా, నావద్ద నెట్లుండును? నిన్ననే నా యాఖరు శాలువ నైదణాలకై తాకట్టు పెట్టితిని" అని యామె పరుపునొద్దకు పోయి బిడ్డ నెత్తుకొనెను. మాకన్న లేచెను. అలమారు తెరచెను. కొంతసేపు వెదకి వెదకి యొక ప్రాతకబ్బాను బైటికి తీసెను. 'ఇదిగో ఇది యంతగా బాగులేదు. కాని కొంత చుట్టపెట్టుకొనుటకు పనికి వచ్చును' అనెను. ఆమె యా కబ్బావైపు చూచెను. తిరిగీ మాకన్నవైపు చూచెను, ఆ కబ్బా నందుకొనెను. కళ్లనీరు నించుకొనెను. మాకన్న యామెవైపునుండి తిరిగిపోయి పరుపుక్రింద వెదకి యొక చిన్నపెట్టెను తీసి, యందులో కొంతసేపు వెదకి యామెవద్దకు వచ్చి యెదురుగా కూర్చొనెను.

"నాయనా, నిన్ను దైవ మాశీర్వదించునుగాక! దైవమే నన్ను నీకిటికీవద్దకు పంపియుండవలెను; బిడ్డ చలిచే గడ్డకట్టిపోవలసినది. నేను బయలుదేరునపుడు గాలి మందముగానే యుండెను గాని యిపుడు చలి గడగడ వడకించుచున్నది. నిజముగా దైవమే నిన్ను కిటికీనుండి బైటికి చూచి నన్ను కనికరింపజేసినాడు. దీనురాలను, పేదరాలను."

మాకన్న చిరునవ్వు నవ్వి యనెను. "ఔను, దేవుడు నాకు చెప్పినాడు. నేను కారణములేక, నూర

కానే కిటికీనుండి చూచుచుండలేదు." తాను కలగన్న సంగతి, నేను తనయింటికి దైవము వత్తునని చెప్పినట్లు తా నొక కంఠస్వరము విన్నసంగతి మాకన్న యామెకు చెప్పెను.

"అన్నియు జరుగవచ్చును" అని యామె లేచి కబ్బా తొడుగుకొని, యనేబిడ్డకు గొంతునుట్టి తిరిగీ మాకన్నకు తన హృదయపూర్వకాభినందనము లర్పించెను.

"దైవముకొరకిది తీసుకొనుము" అని మాకన్న యామె కైదణాల డబ్బు లిచ్చెను, "నీశాలువ తాకట్టు విడిపించుకొనుము" అనెను. వారిద్దరు నొకరికొకరు నమస్కరించుకొనిరి. మాకన్న తలుపు తెరచెను. ఆమె వెళ్లిపోయెను.

ఆమె పోయినతరువాత, మాకన్న పులుసును పూర్తిగా కాచి, దింపివేసి, సామానులను చక్కబెట్టి, పనిచేయుటకు తిరు కూర్చుండెను. కాని పనిచేయుచున్నంతసేపును కిటికీవైపు దృష్టినుంచుట మానలేదు; కిటికీ కడ్డముగా నొక నీడ రాగానే ఎవరు వచ్చిరో యని వాడటు చూచుచు. తా నెరిగినవారును, యెరుగని వారునుకూడ నటునుండి నడచిపోయిరి గాని ముఖ్యమైన వా రెవరును లేరు. ఆఖరు కొక పండ్లమ్ము ముసలిది సరిగా వాని కిటికీముందర నే యాగెను. ఆమె యొక గంపతో పండ్ల నమ్మకమునకు తెచ్చియుండెను. అందు చాలభాగము చెల్లిపోయెనుకాని, యింక కొన్నిమాత్రము మిగిలిపోయినవి. ఆమెభుజముపై నొకకర్రపేళ్ల గోనెసంచి యుండెను. ఏదో క్రొత్తగా కట్టుచున్నయింటివద్ద వాని నామెయేరుకొని, తనయింటికి గొనిపోవుచుండెను. ఆగోనెసంచివలన నామె యలసిపోయినది. భుజము మార్చుకొనుటకామె యచ్చట నాగినది. ఆమె పండ్లగంప నొకతిన్నెపై దింపి, సంచిని నేలపైపడవేసి, కర్రపేళ్లను కుదిలించుచుండెను. ఆమె యిదిచేయుచుండగా, నొక ంకిటోపీ పెట్టుకున్న బాలుడు గంపవద్దకు పరుగున వచ్చి, యొకపండును లాగుకొని తనశక్తికొలది పరుగెత్తి పోవుచుండెను. ముసలిది వానిని చూచెను. వెనుకకు తిరిగెను; వాని చొక్కాచేతిని పట్టుకొనెను. ఆబాలుడు విడిపించుకొనుటకెంతో ప్రయత్నించెను కాని ముసలిది వానిని గట్టిగా రెండుచేతులతో నుబట్టుకొని, తుదకు వాని టోపీనూడద్రోసి, జుట్టును పట్టుకొనెను. బాలుడు మొర్రోయని యరచుచుండెను; ముసలిది వానిని కోపించుచుండెను. మాకన్న కంఠాణిని జోడున గ్రుచ్చుటకు గూడ నాగలేదు. నేలపడవేసి, పరుగెత్తిమెట్లు దిగి వీధి లోనికి పోయెను. ఆదిరులులో వానికండ్లజోడు నేల బడెను. వీడు ముసలిదానిని జేరునప్పటి కామె బాలుని గూబలు పగుల గొట్టుచు, తిట్టుచు, వానిని పోలీసువాని కొప్పగింతునని బెదరించుచుండెను. బాలుడు విడిపించుకొన యత్నించుచు, మొర్రోయని కేకలు వేయుచుండెను. "నేను పండుతీసుకోలేదు. నన్నెందుకు కొట్టెదవు? నన్నువిడిచిపెట్టు, నేను పోయెదను" అనుచుండెను.

మాకన్న వారిద్దరి నడుమకుబోయి వారిని వీడదీసెను. పిమ్మట బాలునిచెయ్యి పట్టుకొని వాడు "అమ్మా, వానిని పోనిమ్ము. దైవముకొరకు వానిని క్షమింపుము." అనెను.

"ఆఁ!! వానిని క్షమించెదను? తిరుగ సంవత్సరమువరకు మరచిపోకుండునట్లు బుద్ధిచెప్పెదను. పోలీసువాని కొప్పగింతును, దొంగ." మాకన్న ముసలమ్మను శాంతపరుప తిరుగ ప్రయత్నించెను. "వానిని, పోనిమ్ము, అమ్మా, యిక నెప్పుడు నట్లు చేయడులే. పోనిమ్ము. విడువు" అనెను.

ముసలమ్మ విడిచిపెట్టెను. బాలుడు పారిపోవ యత్నించెను. కాని మాకన్న వానిని గట్టిగా పట్టుకొని "ముసలమ్మను, క్షమింపుమని వేడుము. మరెప్పుడు నట్లు చేయకుము. నీవు దొంగిలించుట నేను చూచితిని" అనెను.

బాలు డేడ్వ నారంభించెను. ముసలమ్మను క్షమార్పణ వేడెను. "ఇకసరి, ఇదిగో నీకొకపండు తీసికొనుము" అని మాకన్న గంపనుండి యొకపండును తీసి బాలున కిచ్చెను. "దీనిఖరీదు నేను నీకిత్తును, భయపడకుము." అని ముసలమ్మతో ననెను.

"అట్లే పిల్లలను మీరు పాడుచేయుదురు, దొంగలను వారమురోజులవరకు లేవలేనట్లు తన్ని

యుంచిన, మంచి బహుమానమై యుండును" అని ముసలి దనెను.

"ఆ! ఆ! అవ్వా, మనదృష్టిలో నది న్యాయమే మోకాని, దేవునిసృష్టికది యన్యాయము కాదా? ఒకపండును దొంగిలించినందుకు వానిని తన్న వలసిన యెడల, మనపాపములకు మనకేమి చేయవలెనో?" అని మాకన్న నుడివెను.

ముసలిది యూరకుండెను. మాకన్న యామెకు రాజొకడు తనకు చాల ధనము బాకీయున్న వానినెట్లు క్షమించెనో; ఆబాకీదారుడు తనకు కొద్దిగా బాకీయున్న యింకొకని నెట్లు బాధించెనో—ఆకథను చెప్పెను. ఆముసలవ్వ, కథను వినెను; బాలుడుకూడ నిశ్శబ్దముగా నిలబడి వినెను. "దైవము, మనలను క్షమింపుమనుచున్నాడు. లేనిచో మనము క్షమింపబడము ప్రతివానిని క్షమింపవలెను. ముఖ్యముగ నజ్ఞానులయిన బాలురను మన్నింపవలెను" అని మాదిగవాడనగనే ముసలమ్మ తలవంచుకొని, దీర్ఘనిశ్వాసమును వెలిబుచ్చెను. "ఔను, అదంతయు నిజమే, బాగున్నది. కాని వారు బొత్తిగా చెడిపోయి నారు" అనెను. "అయితే, ముసలివారయిన మనము వారికి బుద్ధి గరపవలెను." అని మాకన్న బదులు చెప్పెను.

"నేను చెప్పునదియు నదే. నా కేడుగురు బిడ్డలుండిరి. ఇప్పు డొక్కకూతురే బ్రతికియున్నది" అని యామె ప్రారంభించి, తాను కూతురుతో నెట్లు జీవించుచున్నదో, తన కెందరుమనుమ లున్నారో చెప్పి "నా బలమంతయు నిపు డుడిగిపోయినది. ఐనను యింకను నేను కష్టపడుచుందును. నాకు నా మనుమలను జూచిన చాల యిష్టము. వారు చాలా మంచిపిల్లలుకూడను. వారు నన్ను ప్రేమించునంత నెవ్వరును ప్రేమింపరు. నే నింటివద్ద నున్నపుడు మాసరళ నన్ను విడిచిపెట్టదు. ఎప్పుడునూ అమ్మమ్మ, మంచి యమ్మమ్మ, ప్రియమైన యవ్వ—" అనుచు ముసలమ్మ కనుల నీరుపెట్టుకొనెను. అచ్చటనేయున్న బాలునివంక జూచి యామె "ఔను, పాపము, ఇతడు చిన్నబిడ్డడు, దైవ మితని నాశీర్వదించుగాక!" యనెను.

ఆమె గోనెసంచిని భుజమున కెత్తుకొన యత్నించెను. బాలు డామెవద్దకు చేరి యనెను "అమ్మా, నీ దారినే నేనును పోవుదును. నేను సంచి నెత్తుకొని వత్తును లెమ్మా, పద."

ముసలమ్మ తలవంచుకొని, వానిని సంచి నెత్తుకొన నిచ్చెను. వారిద్దరును కలిసి వీధివెంబడి పోవుచుండిరి. ముసలిది మాకన్న తీసిన పండ్ల కిరీదు నడుగుటకూడ మరచిపోయెను. మాకన్న చాల సేపటివరకును వారిద్దరును మాటలాడుకొనుచు కలిసి వెళ్లుట, చూచుచు వినుచు నిలబడిపోయెను.

వారిద్దరును పూర్తిగ దృష్టినుండి తొలగిపోయిన పిదప; మాకన్న యింటికి మరలెను. మెట్లమీద పడియు, విరిగిపోకుండిన తన కండ్లజోడు చూచి తీసికొనెను. తిరిగి కంతాణి పుచ్చుకొని పనిముందు కూర్చొనెను. కాని త్వరలో చీకటిపడెను. పనిచేయుట కేమియు కనబడకుండెను. వీధి దీపములు వెలిగించువాడు, దీపములు వెలిగింప నా వీథిలోనుండి పోవుచుండుట చూచి 'దీపముల వేళయైనది' యనుకొని లేచి దీపపువత్తి కత్తిరించి వెలిగించి పైని వ్రేలాడగట్టి పనిని తిరుగ నారంభించెను. కొంతసేపటిలో తాను కుట్టుచుండిన జోడు పూర్తియయ్యెను. దాని నిటునటు త్రిప్పి, నలువైపుల కుట్టును చూచి, బాగుగా తయారైనదని తృప్తిజెందెను. తన సామగ్రి నంతను చక్కబెట్టి, చెత్తనంతయు తొలగించి, దారము కంతాణి తోలునుతీసి దాచి దీపమును దింపి బల్లపై బెట్టెను. గూటినుండి మతగ్రంథమునుతీసి, తొలినాడు తోలుముక్క గురుతుగాపెట్టి యుంచిన పుటను తెరువదలచెను గాని యది మరొకచోట తెరచుకొనెను. ఇంతలో మాకన్నకు తటాలున గతరాత్రి కల జ్ఞప్తికివచ్చి తలచుకొనుచుండి నంతలో తనవెనుక నొక శబ్దము వానికి వినబడినట్లయ్యెను—గదిలో నడుగుల చప్పుడు—వాడు వెనుదిరిగి చూచెను. ఆమూల చీకటిలో మనుష్యులు నిలబడియున్నట్లయ్యెను—తాను పోల్చుకొనజాలని యాకారములు......

ఒక కంఠస్వర మతని చెవిలో చెప్పినటు లయ్యెను. "మాకన్నా, మాకన్నా, నీవు నన్నెరుగవా?" "ఎవరది" "నేను" అన్నది కంఠస్వరము. చీకటికోణమునుండి సీతన్న రూపములు బయటికి కనబడెను; చిరునవ్వు నవ్వెను; తిరిగి మేఘమునవలె నదృశ్య మయ్యెను. అచ్చట నెవరును లేరు.

"ఇదిగో, నేనుకూడను" అని కంఠస్వరము వినబడెను. చీకటినుండి యా స్త్రీ తన చంటిబిడ్డ నెత్తుకొని కనబడెను; తరుణి చిరునవ్వు నవ్వెను; బిడ్డయు నవ్వెను; వారుకూడా మాయమైరి.

"ఇదిగో నేనును" అని మరల వాణి వినవయ్యెను. ఆ ముసలమ్మయు బాలుడును గోచరమైరి; చిరునవ్వు నవ్విరి; అంతర్హితులైరి.

మాకన్నహృదయ మానందభరిత మయ్యెను. దైవము నొకసారి తలచుకొనెను; కళ్లజోడు పెట్టుకొనెను; పుస్తక మెచట తెరచుకొనెనో యచటనే చదువ నారంభించెను. పత్రముయొక్క పైభాగమున వా డిట్లు చదివెను:—

"నేను క్షుభితుడనైతిని. నీవు నా కాహార మొసంగితివి. నేను పిపాసాబాధితుడనైతిని. నీవు నాకు పానీయ మొసంగితివి. నేను నీ కపరిచితుడనై యుంటిని, ఐనను నీవు నా కాశ్రయప్రదాతవైతివి."

మరియు పత్రముయొక్క దిగువభాగమున నీ రీతి చదివెను:—

"నా సోదరులైన వీరిలో నే యధమునకైనను నీ వెంత యొసంగితివో, అంతయు నీవు నా కొసంగితివి"

మాకన్న తన కల స్వప్న కాలేదనియు, యథార్థమై వర్తిల్లెననియు, నిజముగ నాడు ప్రభువు తనకడకు వచ్చెననియు, తా నతనికి సుస్వాగత మొసగి యాదరించెననియు తలపోసి సంతృప్తు డయ్యెను.

---

# స్వప్న భంగము

మల్లవరపు విశ్వేశ్వరరావు గారు

సమ్మోహన స్వప్న
సంతతానంద ప్ర
పంచమ్ములో సుప్తి
నింతకాలము దాక
వింతవింత సుఖప్ర
వంతీజలాలలో
తేలియాడుచు నింద్రి
యాలు సల్పెను కేళి!

నీలాంబుదాలలో
దూరి దోబూచాడి,
గాలిమేడల శాంతి
గోరి దేహము వాల్చి,
శంపాలతల పూలు
త్రుంపి దామము లల్లి
కవితాప్రియామంజు
కంఠాన మెలివైచి,